క్లుప్తంగా

తల్లి గెలుపు కోసం తనయుల ప్రచారం



నాగులగూడెంలో ప్రచారం చేస్తున్న రోహిత్, సాయి విశాల్

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెల్లం రాజ్యలక్ష్మిని గెలిపించాలని కోరుతూ ఆమె తనయులు రోహిత్, సాయి విశాల్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం బుట్టాయగూడెం మండలంలోని గిరిజన గ్రామాల్లో వారు ప్రచారం చేశారు. 40 డిగ్రీల ఎండను సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమ తల్లి రాజ్యలక్ష్మిని గెలిపించాలని కోరారు. వీరితోపాటు రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్‌బాజీ, కొల్లూరి దినేష్, తమ్మారాజు, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే సీఎంపై దాడులు



సీఎంపై దాడిని ఖండిస్తున్న నేతలు

టి.నరసాపురం: సిద్ధం సభలు, బస్సు యాత్రలకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడులు చేయిస్తున్నారని పారిశ్రామికవేత్త, సామాజికవేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు పెండ్యాల అభిషేక్ అన్నారు. బొర్రంపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన రాళ్ల దాడిని తీవ్రంగా ఖండించారు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. సంక్షేమ పాలన ద్వారా వైఎస్ జగన్ ప్రజల ప్రేమాభిమానాలను చూరగొన్నారన్నారు. ఈ ఎన్నికల్లో బొర్రంపాలెంలో వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు.

పోలవరంలో రెండు ఇళ్లు దగ్ధం



బాధితులకు వంటసామగ్రి అందిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని గణేష్ నగర్‌లో రెండు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సోమవారం ఉదయం గొలిసే రాజమ్మ, తుపాకుల రమణ అనే కుటుంబాలకు చెందిన వ్యక్తులు వేట కోసం వెళ్లారు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు వీరిరువురి తాటాకిళ్లు ఇంట్లో ఉన్న సామగ్రితో సహా దగ్ధం కావడంతో సుమారు రూ. 2లక్షల ఆస్తి నష్టం సంభవించింది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సమీప ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు కొవ్వూరు ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. వీఆర్వో దత్తు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని తహసీల్దార్‌కు తెలియజేశారు. ఘటన వివరాలు తెలిసిన వెంటనే ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారికి అవసరమైన వంట సామగ్రి, దుస్తులు, బియ్యం , కూరగాయలు తదితర వస్తువులను అందజేశారు. అలాగే వీరికి పక్కా గృహనిర్మాణం ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



శివాలయం వీధిలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభం

కుక్కునూరు: ప్రతి ఏడాది గోదావరి వరదలతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురై విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుండటంతో సమస్యను పరిష్కరించే దిశగా విద్యుత్ శాఖాధికారులు మండలంలో పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం కుక్కునూరు మండల కేంద్రంలోని శివాలయం వీధిలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు ఈ పనులు వివిధ ప్రాంతాల్లో కొనసాగనున్నాయి.

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

జంగారెడ్డిగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులు బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగదుర్గారావు అన్నారు. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుని అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఎటువంటి పొరపాట్లు చేయకుండా ఇచ్చిన ఫార్మాట్‌లు అన్ని సరిగా నింపి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి
- అంతర్వేదిగూడెంలో ఎన్నికల ప్రచారం



అంతర్వేదిగూడెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి



ప్రచారంలో భాగంగా పొగాకు గ్రేడింగ్ చేస్తున్న రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: నవరత్న పథకాల అమలు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటా వెలుగులు నింపారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని మారుమూల గ్రామాలైన గాడిదబోరు, ఇనుమూరు, కోర్సవారిగూడెం, కామవరం, మోతుగూడెం, పందిరిమామిడిగూడెం, బూరుగువాడ, అంతర్వేదిగూడెం, నాగులగూడెం, చెంచుగూడెం, గంగన్నగూడెం, కాకులవారిగూడెం గ్రామాల్లో సోమవారం గడపగడపకూ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మితోపాటు ఎమ్మెల్యే బాలరాజు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల తలరాతలను మార్చిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. సంక్షేమ పథకాలతో పేదల మనసుల్లో జగనన్న సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో ఎనలేని కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా గిరిజనుల పోడు భూములకు పట్టాలు కల్పించడంతోపాటు గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం పథకాలు ఇంటికే చేరేలా కృషి చేశారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేశారని అన్నారు. ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతున్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. కాగా గ్రామాల్లో ప్రచారం ఉత్సాహంగా సాగింది. అభ్యర్థి రాజ్యలక్ష్మికి ప్రజలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని రాజ్యలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ బాజీ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు జోడే సత్యదుర్గా ప్రసాద్, తెల్లం వెంకటలక్ష్మి, మడకం రామలక్ష్మి, తెల్లం వెంకాయమ్మ, మాల్చి వెంకన్నబాబు, పెడకం విజయలక్ష్మి, కుంజా దుర్గమ్మ, తెల్లం జయమ్మ, నాయకులు గంటసాల గాంధీ, కె.ఈసు, కె.లక్ష్మణ్‌కుమార్, వెట్టి పెంటమ్మ, కారం వాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలు తట్టుకోలేక..

- మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్న వలంటీర్లు
- ప్రజాసేవ చేస్తున్న తమపై ఎందుకీ కక్ష అని ఆవేదన



కొయ్యలగూడెం: రాజీనామాలు చేసిన పొంగుటూరు వలంటీర్లు



టి.నరసాపురం: రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు



కుక్కునూరు: ఎంపీడీవో నరసింహారావుకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గ్రామగ్రామానా వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నారు. సీతంపేట గ్రామం నుంచి 15 మంది, పొంగుటూరు నుంచి ఇరవై మంది, సరిపల్లి గ్రామానికి చెందిన 17 మంది వలంటీర్లు రాజీనామాలు సమర్పించారు. ఈమేరకు తమ రాజీనామా ప్రతాలను ఎంపీడీవో అశోక్‌కుమార్‌కి సోమవారం అందజేశారు. గౌరవ వేతనంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న తమపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేసి తమ ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని వలంటీర్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. కొద్దిరోజుల వరకు వలంటీర్ల బాధ్యతలపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు.. ప్రజల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక ఇప్పుడు వలంటీర్లకు అనుకూలంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

టి.నరసాపురంలో 30 మంది రాజీనామా

టి.నరసాపురం: ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యలకు మనస్థాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు ప్రకటించారు. టి.నరసాపురం సచివాలయం–1, సచివాలయం–2 పరిధిలోని 30 మంది వలంటీర్లు సోమవారం రాజీనామాలు చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను సచివాలయం–1 కార్యాలయ ప్రతినిధి కుమారికు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తాము గౌరవ వేతనంతో సమాజ హితం కోసం పనిచేస్తుంటే రాజకీయ లబ్ధి కోసం మమ్మల్ని విధులకు దూరం చేశారని ఆరోపించారు.

13 మంది వలంటీర్ల రాజీనామా

కుక్కునూరు: చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్ల రాజీనామాలు మండలంలో కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం కూడా మండలంలోని మారేడుబాక సచివాలయం పరిధిలో 9 మంది, తొండిపాక సచివాలయం పరిధిలో ఇద్దరు వలంటీర్‌లు, సీతారామనగరం సచివాలయం పరిధిలో ఇద్దరు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో నరసింహారావుకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌లు మాట్లాడుతూ నిస్వార్థంగా పార్టీ తారతమ్యాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న తమపై లేనిపోని నిందలు మోపి చంద్రబాబు వలంటీర్ల మనోభావాలను దెబ్బతీశారని, ఈ ఎన్నికల్లో వలంటీర్ల సత్తా ఏంటో చంద్రబాబుకు రుచి చూపిస్తామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న రాజీనామాలు

ద్వారకాతిరుమల: వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు ఇంకా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా పంగిడిగూడెంలో 35 మంది, ఎం.నాగులపల్లిలో 13 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. పంగిడిగూడెంలో పంచాయతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావుకు, ఎం.నాగులపల్లిలో పంచాయతీ కార్యదర్శి బాలామణికి రాజీనామా ప్రతాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా ఉంటూ, నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తమపై టీడీపీ, జనసేన అధినేతలు, నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలతో మనస్తాపం చెంది రాజీనామాలు చేస్తున్నట్టు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుంటామని చెప్పారు.

పొదుపును అలవాటుగా మార్చుకోవాలి



పోస్టల్ పాస్‌బుక్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు పొదుపు చేయడాన్ని అలవాటుగా మార్చుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే పొదుపు అలవాట్లు చేసుకోవడం వల్ల విద్యార్థులకు ఆర్థిక నిర్వహణపై మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. అనంతరం స్థానిక పోస్టాఫీస్ నందు 14 మంది విద్యార్థులతో సేవింగ్స్ ఖాతా, రికరింగ్ డిపాజిట్ ఖాతాలను తెరిపించారు. పోస్టల్ శాఖ అధికారి డి.కాంతారావు విద్యార్థులకు పాస్ బుక్‌లను పంపిణీ చేశారు. అధ్యాపకులు డా. కె.ఉత్తమ్‌సాగర్, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం మధు, సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, డా.జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేయండి



జంగారెడ్డిగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



టిఫిన్ సెంటర్‌లో మినపట్లు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలోని 20, 21వ వార్డుల్లో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య అధ్యక్షతన సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తిన లక్ష్మి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తూచ తప్పకుండా హామీలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని పేర్కొన్నారు. వై నాట్ 175 అని జగన్ ధైర్యంగా చెబుతున్నారంటే ప్రజలు ఆయన వెంట ఉన్నారని బలమైన నమ్మకం అన్నారు. ఆ నమ్మకాన్ని నిజం చేసేలా ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యేగా కంభం విజయరాజును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మేడవరపు విద్యాసాగర్, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి, స్థానిక కౌన్సిలర్ కంచర్ల గీత, పీపీఎస్ చంద్రరావు, కటారి వాసు, మానవత మూర్తి, దొంతు మాధవ్, నేకూరి కిషోర్, తడికమల్ల మురళి, ఉగ్గం దుర్గాప్రసాద్, ఎల్‌వీఆర్, కోఆప్షన్ సభ్యులు వెంప ఐజి, ఏలూరు జిల్లా జేసీసీ చింత అనిల్‌కుమార్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీను, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, పార్టీ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు గెద్దాడ శ్రీనివాస్, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ భావన ఋషి, బిలాల్ మసీదు అధ్యక్షుడు షేక్ జిలాని, చిన్న తిరుపతి దేవస్థానం డైరెక్టర్ వాసా రామకృష్ణ పాల్గొన్నారు.

వనితమ్మ నామినేషన్ దాఖలుకు తరలిరండి

రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు పిలుపు



సమావేశంలో పార్టీ శ్రేణులకు సూచనలిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజబాబు

ద్వారకాతిరుమల: రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు పిలుపునిచ్చారు. స్థానిక కాపు కల్యాణ మండప ఆవరణలో సోమవారం పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 19న ఉదయం 10.45 గంటలకు గోపాలపురం తహసీల్దార్ కార్యాలయంలో మంత్రి వనిత నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడి నుంచి బయల్దేరి వెళ్లాలి, కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలి అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ మండలంలోని పార్టీ శ్రేణులు 19న ఉదయం 7.30 గంటలకల్లా దేవరపల్లి మండలం యర్నగూడెంలోని పార్టీ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు భారీ కార్లు, బైక్ ర్యాలీలతో గోపాలపురానికి తరలివెళ్లాల్సి ఉంటుందన్నారు. అట్టహాసంగా జరిగే ఈ కార్యక్రమంలో ఆమె గెలుపు కనబడాలన్నారు. అలాగే ప్రతిపక్ష నేతల గుండెల్లో గుబులు పుట్టే విధంగా ఈ ర్యాలీ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, రుద్ర శివ, చిలుకూరి చంద్రం, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, సొసైటీ చైర్‌పర్సన్‌లు చెరుకూరి ప్రసాదరావు, గుర్రాల లక్ష్మణ్, ఎంపీటీసీ అల్లాడ హరేరామకృష్ణ, ఆకుర్తి సత్యన్నారాయణ, దాసరి రాంబాబు, సర్పంచ్‌లు కుంటం స్వర్ణలత, పోల్కంపల్లి అనీల్, చెలికాని బుల్లియ్య, దాకారపు అగ్గియ్య, దాసరి ఏసురత్నం, సాదనాల రాజా తదితరులున్నారు.

ఎండ దెబ్బకు 200 బ్రాయిలర్ కోళ్లు మృతి

ద్వారకాతిరుమల: ఎండదెబ్బకు మండలంలోని దొరసానిపాడులో 200 బ్రాయిలర్ కోళ్లు సోమవారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు శ్రీను తన తోటలోని ఫారాల్లో బ్రాయిలర్ కోళ్లను పెంచుతున్నారు. అయితే ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండటంతో వాటి రక్షణకు పలు చర్యలు కూడా చేపట్టారు. అయినా ఎండ తీవ్రత అధికమవడంతో ఉక్కిరిబిక్కిరై ఒకే రోజు 200 కోళ్లు మృతి చెందాయి. ముందు ముందు ఎండలు మరింతగా పెరిగితే కోళ్ల పెంపకం కష్టమేనని రైతులు వాపోతున్నారు.

నేటినుంచి హోమ్ ఓటింగ్‌పై పరిశీలన



హోమ్ ఓటింగ్‌పై మాట్లాడుతున్న చింతలపూడి ఆర్వో, ఆర్డీవో అద్దయ్య

జంగారెడ్డిగూడెం: ఈ నెల 16, 17, 18 తేదీల్లో హోమ్ ఓటింగ్‌పై డోర్ టు డోర్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు చింతలపూడి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం బూత్‌లెవెల్ అధికారులు, సెక్టోరల్ అధికారులతో హోం ఓటింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో అద్దయ్య మాట్లాడుతూ పీడబ్ల్యూడీ, 85 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్స్ ఎవరైతే పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి ఓటును వినియోగించుకోలేరో వారి కోసం కేంద్ర ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా బీఎల్‌వోలు డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేసి పీడబ్ల్యూడీ, 85 సంవత్సరాలు నిండిన వృద్ధుల పరిస్థితిని పరిశీలిస్తారన్నారు. వారు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేయలేని స్థితిలో ఉంటే వారి నుంచి డిక్లరేషన్ తీసుకుని హోమ్ ఓటింగ్‌పై ఏఆర్‌వో, సెక్టార్ అధికారులు, ఆర్‌వోలకు నివేదిస్తారన్నారు. వివరాలను పరిశీలించిన అనంతరం హోమ్ ఓటింగ్‌పై అనుమతి ఇస్తారని, ఈ క్రమంలో వారికి పోస్టల్ బ్యాలెట్‌ను అందజేస్తారన్నారు. ఒకసారి హోమ్ ఓటింగ్ నిర్ణయించిన తరువాత వారు పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేసే అవకాశం ఉండదన్నారు. ఓటర్ల జాబితాల్లో సదరు వ్యక్తుల వివరాలు నోట్‌పై చేస్తామన్నారు. కావున డిక్లరేషన్‌కు ముందే ఓటర్లు హోమ్ ఓటింగ్‌పై అవగాహన కలిగి నిర్ధారించుకున్న తరువాత మాత్రమే డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. కాగా జంగారెడ్డిగూడెం మండలంలో 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు మొత్తం 562 మంది ఉండగా, పీడబ్ల్యూడీ ఓటర్లు 900 మంది ఉన్నారన్నారు. వీరందరి ఇళ్లకు బీఎల్‌వోలు వెళ్లి డోర్ టు డోర్ వెరిఫికేషన్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేంద్ర కుమార్, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు గిరిజన యువతి ధర్నా



బోడిగూడెంలో ప్రియుడి ఇంటి ముందు ధర్నా చేస్తున్న గిరిజన యువతి

కొయ్యలగూడెం: ప్రేమించి వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ బోడిగూడెంలో సోమవారం ఒక గిరిజన యువతి ఆందోళనకు దిగింది. బాధిత యువతి భారతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోడిగూడెం గ్రామానికి చెందిన మెంటే సాయి, బుట్టాయిగూడెం మండలం దొరమామిడి గ్రామపంచాయతీ రంగాపురం గ్రామానికి చెందిన కోడె రమ్య భారతి ఇద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. సాయి వివాహం చేసుకుంటానని చెప్పగా, దీనిపై ఇరు కుటుంబాలు కూడా అంగీకరించాయి. ఈ నేపథ్యంలో ఇద్దరూ శారీరక సంబంధం ఏర్పరుచుకోవడంతో భారతి గర్భం దాల్చింది. వివాహానికి ముందు గర్భం దాల్చితే తమ పరువు పోతుందని సాయి కుటుంబ సభ్యులు తనను పరీక్షలకు అని చెప్పి తీసుకువెళ్లి దేవరపల్లిలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో మత్తు ఇంజక్షన్ ఇప్పించి అబార్షన్ చేయించారని బాధితురాలైన రమ్య భారతి వాపోయింది. కొద్దిరోజుల క్రితం రహస్యంగా సాయి వేరొక యువతిని వివాహం చేసుకున్నట్లు తెలుసుకున్న రమ్య భారతి తన కుటుంబ సభ్యులతో కలిసి బోడిగూడెం వచ్చి తనకు న్యాయం చేయాలంటూ సాయి ఇంటి వద్ద ఆందోళన చేపట్టింది. దీంతో సాయి కుటుంబసభ్యులు పరారు కాగా, ఆందోళన కొనసాగిస్తోంది. దీనిపై పోలీసులను వివరణ కోరగా, తమకు సమాచారం లేదని తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన తప్పనిసరి



జంగారెడ్డిగూడెం బస్టాండ్ వద్ద ప్రత్యేక డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జంగారెడ్డిగూడెం: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి జి.అబ్రహం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం జంగారెడ్డిగూడెం బస్టాండ్ వద్ద అగ్నిమాపక అధికారులు ప్రత్యేక డ్రిల్ నిర్వహించారు. అగ్రిప్రమాద సమయంలో నిర్వహించే కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో డెమో రూపంలో వివరించారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలు, వాటి వల్ల కలిగే నష్టం, అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం జరిగిన వెంటనే చేపట్టాల్సిన ముందస్తు చర్యలు వివరించినట్లు చెప్పారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



సీతారామచంద్రస్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన బూరుగువాడలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలను అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కుంజా భూమయ్య, కుంజా నాగరాజు, బట్టా గంగరాజు, లక్ష్మి, బట్టా బాబూరావు, రామలక్ష్మి, కొండేపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డులో వేంచేసియున్న శ్రీసీతారామ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కొండలరావు తెలిపారు. స్వామివారిని పెండ్లి కుమారుడిని, సీతమ్మ తల్లిని పెండ్లి కుమార్తెను చేయడం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణ, రాత్రి ధ్వజపట ప్రతిష్ట, ధ్వజారోహణ ఉంటుందన్నారు. 17న 10.30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, 18న శ్రీపుష్పయాగం, పవళింపు సేవ, 19న అన్నసమారాధన, అనంతరం ఊరేగింపు నిర్వహించబడుతుందని తెలిపారు.